


www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 27 | ఏప్రిల్ | 2025 పేజీలు 8

# ఉన్మాదం దేశానికి ప్రమాదకరం





-ప్రజలను విస్మరిస్తే పతనం తప్పదు
-పేదల ఆయువు ఎర్ర జెండానే
-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
-వరద నర్సింహారావు సహా సిపిఐలో వందలాది మంది చేరిక
-ఖమ్మంలో భారీ ప్రదర్శన

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉన్మాదం దేశానికి ప్రమాదకరమని దేశ భవిష్యత్తుకు అది గొడ్డలి పెట్టుగా మారనుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉన్మాదానికి, టెర్రరిజానికి మతం ప్రాధాన్యత కాదని అలజడి సృష్టించడం ప్రజలను హింసించ డమే దాని లక్ష్యమని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీలో ఖమ్మం నగరానికి చెందిన వరద నర్సింహారావు సహా వందలాది మంది సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా ఖమ్మం ముస్తఫానగర్ సెంటర్ నుంచి అల్లిపురం రోడ్డులోని బహిరంగ సభా స్థలి వరకు డప్పు, కోలాట దళాలు వంద లాది మంది కార్యకర్తలతో ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ ఉన్మాదులకు మతం లేదని గతంలో అనేక మంది ప్రముఖులను హతమార్చిన విషయంలోనూ ఇది రుజువైందన్నారు. టెర్రరిజం విష యంలో ఒక మతాన్ని బూసిగా చూపడం సరి కాదన్నారు. టెర్రరిస్టు దాడిని అంచన వేయడంలోనూ, అడ్డుకోవడం లోనూ వైఫల్యం చెందిన తర్వాత దేశ ప్రజల ఆలోచనలను మళ్లించే రీతిలో మోడీ, అమిత్‌షా లాంటి నేతలు ప్రకటనలు చేస్తున్నారని ఇది సరి కాదని ఆయన స్పష్టం చేశారు. విభిన్న మతాల, కులాల, భాషల సమ్మిళితమైన భారతదేశంలో ఏక పక్ష విధానాలు దేశ విచ్ఛిన్నానికి దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. ఉన్మాద మూర్ఖుల చేష్టలను ఒక మతానికి, ప్రాంతానికి

మిగతా 2లో..

# సమాజానికి వైద్యులను అందించడం గర్వకారణం





-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
-మమతలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మమత వైద్య విద్యా సంస్థ లను స్థాపించి ఎంతో మంది వైద్యులను సమాజానికి అందించడం గర్వకారణంగా ఉందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. వైద్య విద్యలో గ్రాడ్యు యేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పువ్వాడ అజయ్‌కు మార్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మమత ఆసు పత్రి ఆవరణలో మమత వైద్య, దంత, నర్సింగ్ కళాశాలల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ గ్రాడ్యు యేషన్ డేలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కాళోజీ నారాయణ రావు వైద్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్

మిగతా 2లో..

# పేదలను పీక్కుతింటున్న ఫైనాన్స్ సంస్థలు..!



-గ్రామాల్లో శృతిమించిన దోపిడీ
ఆ వైపు కన్నెత్తి చూడని అధికారులు
-ఉసురు తీస్తున్న అధిక వడ్డీలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుం బాల్లో లక్ష్యంగా ఫైనాన్స్ సంస్థలు యథేచ్ఛగా దోపిడీ సాగిస్తున్నాయి. అధిక వడ్డీలు పేదల ప్రాణాలు తీస్తు న్నాయి. అప్పు తీసుకోక తప్పని స్థితిలో ఫైనాన్స్ సంస్థల వద్ద అప్పు తీసుకుంటే వడ్డీలకే పేదల సంపాదన సరిపో తుంది. ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు, వారం వారం చెల్లిం పుల పేరుతో పేదలను పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఆస్తి, ఏ ఆర్థిక ఆధారం ఇవ్వకుండా బ్యాంకులు అప్పులు ఇవ్వక పోవడం, ప్రభుత్వ ఆర్థిక చేయూత ప్రకటనలకు, కాగితా లకు, మాటలకు పరిమితమవ్వడం పేదలకు అప్పు తీసు కోక తప్పని స్థితి. ఈ బలహీనతే ఫైనాన్స్ సంస్థలకు వరంగా మారింది. గ్రామాల్లో పేదల వాడలను లక్ష్యంగా చేసుకుని ఫైనాన్స్ సంస్థల ఏజెంట్లు తిరుగుతుంటారు. ఆర్థిక అవసరాలను గుర్తించి అప్పు ఎరగా వేస్తారు. వారం వారం చెల్లించే పద్ధతిలో అప్పు ఇస్తారు. మూడు నుంచి నాలుగు రూపాయల వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. వా రం రోజుల కూలీ డబ్బులు వడ్డీకే సరిపోతుంది. అనారోగ్య

మిగతా 2లో..

# ఉన్మాదం దేశానికి ప్రమాదకరం







(మొదటిపేజీ తరువాయి)

ముడి పెట్టడం సరికాదన్నారు. పెహల్గాం ఘటనలో ముస్లిం టెర్రరిస్టులు కాల్చి చంపితే అదే ఘటనలో గాయపడిన వారికి అనేక మందికి ముస్లింలు సేవలు అందించి ప్రాణాలు కాపాడరన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. ప్రజలను విస్మరించి పాలన చేస్తున్న మోడీ తన అనుకూలురైన సంస్థల అధిపతులకు మేలు చేస్తున్నారన్నారు. కమ్యూనిస్టుల అవసరం ఈ దేశంలో పెరుగుతుందన్నారు. లౌకిక, ప్రజాస్వామిక వాదులు కమ్యూనిస్టుల అవసరాలను గుర్తిస్తున్నారని ఈ దేశ ప్రజలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించిన నాడు ప్రజా వ్యతిరేకులకు గుణపాఠం తప్పదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని తిరిగి ప్రజల విశ్వాసం పొందాల్సిన అవసరం పాలకులకు ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పేదల పక్షాన పోరాడుతుందని ప్రజల సంక్షేమమే కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని దీనిపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలన్నారు. కమ్యూనిస్టులకు మాత్రమే దేశ ప్రజలను చైతన్యపరిచే శక్తి ఉందని ప్రజలు చైతన్యవంతులైతే టెర్రరిజం మూలాలు ఉండవని కూనంనేని తెలిపారు. నిరంతరం ప్రజల చైతన్యం కోసం, హక్కుల కోసం, సమస్యల పరిష్కారంకోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందన్నారు. రాజకీయాలు కలుషితం అవుతున్నాయని ఫిరాయింపు దారులు పెరిగి ప్రజల మనోభావాలను హేళన చేస్తున్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ద్రోహం చేసిన ఎవరిని వదిలేది లేదన్నారు. అధికారం శాశ్వతం కాదని ప్రజల పక్షాన పనిచేయడమే అతి గొప్ప అధికారమని ఆయన తెలిపారు. వరద నర్సింహారావు సహా వందలాది మందికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నగర సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, వరద నర్సింహారావు తదితరులు ప్రసంగించగా ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు,పోటు కళావతి, మహ్మద్ సలాం, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, తాటి నిర్మల, బోడా వీరన్న, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాలరామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

**భారీ ప్రదర్శన...**

సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముస్తఫానగర్ సెంటర్ నుంచి అల్లిపురం రోడ్డులోని బహిరంగ సభాస్థలి వరకు భారీ బహిరంగ సభ జరిగింది. డప్పు, కళా నృత్యాలు, కోలాటం దళాలు నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అగ్రభాగాన సిపిఐ జిల్లా నాయకత్వం నడవగా పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రదర్శనలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు సిపిఐలో చేరుతున్న సందర్భంగా ఆటో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పతాకాన్ని మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు.

# పేదలను పీక్కుతింటున్న ఫైనాన్స్ సంస్థలు

(మొదటిపేజీ తరువాయి)

కారణాలు, కుటుంబ అవసరాల కోసం అప్పులు తీసుకుని ఆ ఊబిలో కూరుకుపోతున్నారు. ఏ ఇబ్బంది కారణంగానైనా వారం నాడు డబ్బులు చెల్లించకపోతే మరి కొంత అదనపు వడ్డీ వేస్తారు. సకాలంలో అప్పులు చెల్లించకపోతే అప్పు తీసుకున్న వారు నరకం చూడాల్సిందే. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల బారీన పడి ప్రాణాలు కోల్పోయిన వారు ఎందరో. అధిక వడ్డీలకు అప్పులిచ్చి ఇష్టానుసారంగా ఇబ్బందులు పెడుతున్న అధికార యంత్రాంగం, పోలీసులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు.

**ద్విచక్ర వాహన సంస్థలది అదే తీరు...**

ద్విచక్ర వాహన సంస్థలది అదే తీరు. మారిన పరిస్థితుల నేపథ్యంలో దినసరి కూలీ సైతం ద్విచక్ర వాహనాన్ని వినియోగించక తప్పనిస్థితి. నగదు చెల్లించి కొత్త ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసే స్థోమత లేని వారు సెకండ్ సేల్స్ చేసే సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ఈ సంస్థల పరిస్థితి ఎలా ఉందంటే వారు కొనుగోలు చేస్తే వెండి, అమ్మితే బంగారం అన్నట్లుగా వ్యవహరిస్తారు. ద్విచక్ర వాహనాలను సెకండ్ సేల్స్ చేసే సంస్థలపై పలు ఆరోపణలు ఉన్నాయి. వీటికి తోడు అధిక వడ్డీలకు ఫైనాన్స్ ఇవ్వడం వాయిదా తప్పితే వేధింపులకు గురి చేయడం, దౌర్జన్యాలకు పాల్పడడం చేస్తున్నారు. వీరి వేధింపులకు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఎన్నో. ఇందులో కొన్ని సంస్థలు గ్యాంగులను నిర్వహిస్తూ కాస్త ఎదురు ప్రశ్నించిన వారిపై దాడులకు ఊసిగొల్పుతున్నారు. గతంలో అధిక వడ్డీలకు అప్పులిచ్చి పేద, మధ్యతరగతి ప్రజలను వేధించే సంస్థలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఫిర్యాదు అందితే వెంటనే చర్యలు తీసుకోవడంతో ఫైనాన్స్ సంస్థల ఆగడాలు కొంత నిలిచిపోయాయి. ఇప్పుడు పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని సంస్థలు పోలీస్ లేదా ఇతర అధికారులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకుని బాధితులను మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. బాధితుల పక్షాన ఎవరైనా ప్రశ్నిస్తే డబ్బులు డిమాండ్ చేశారని, దౌర్జన్యానికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేసి భయపెడుతున్నారు. బోనకల్ మండలంలో బాధితుల పక్షాన నిలిచిన ఒక రాజకీయ పార్టీపైన పోలీసులకు ఫిర్యాదు చేసి భయపెట్టే ప్రయత్నం చేశారు. వీటన్నింటిపైన జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి దోపిడీని నిలువరించాలని కోరుతున్నారు. అప్పు ఇచ్చినప్పుడు వడ్డీ తీసుకోవడం న్యాయమే కానీ అవసరాన్ని గుర్తించి అధిక వడ్డీతో వేధింపులకు పాల్పడడమే ఈ ఫైనాన్స్ సంస్థల లక్ష్యం.

# సమాజానికి వైద్యులను అందించడం గర్వకారణం






(మొదటిపేజీ తరువాయి)

పివి నందకుమార్‌రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు, మమత సంస్థల ఫౌండర్ పువ్వాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మమత వైద్య సంస్థలను స్థాపించి సమాజానికి ఎంతో మంది వైద్యులను అందించడం గర్వకారణంగా ఉందన్నారు. 25 ఏళ్ల క్రితం స్థాపించిన మమత వైద్య సంస్థలు రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపుపొందడం సంతోషంగా ఉందన్నారు. మమత వైద్య సంస్థల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు కావాల్సిన వసతులను అందిస్తూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేరుస్తున్నట్లు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్య రంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ దానికి అనుగుణంగా తమ వైద్య సంస్థల్లో సౌకర్యాలు, చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. వైస్ ఛాన్సలర్ నందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో మమత వైద్య సంస్థలను నెలకొల్పి ఎంతో మంది వైద్యులను అందిస్తున్నందుకు యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. వైద్య విద్యను అభ్యసించి పట్టా అందుకున్న విద్యార్థులు వైద్య వృత్తిని దైవంగా భావించి సేవలు అందించాలని తెలిపారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా వైద్య విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 360 మంది వైద్య విద్యార్థులు, 190 మంది దంత విద్యార్థులు, 100 మంది నర్సింగ్ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ పట్టాలను పంపిణీ చేశారు. పువ్వాడ ఉదయ్‌కుమార్ జయశ్రీ కుమారుడు నరేన్ రాజ్ వైద్య విద్య పిజిలో గ్రాడ్యుయేట్ పట్టా అందుకున్నారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా మమత ఆసుపత్రి ఆవరణ మొత్తం సందడి నెలకొంది. వైద్య విద్యను పూర్తి చేసి తమ పిల్లలు పట్టా అందుకునే ఘట్టాన్ని చూసేందుకు తల్లిదండ్రులు తాత, అమ్మమ్మ, నాయనమ్మ లు , బంధువుల రాకతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. పట్టా అందుకున్న తమ పిల్లలతో తల్లిదండ్రులు, బంధువులు ఫోటోలు, సెల్ఫీలు దిగుతూ తమ సంతోషాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మమత ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ పువ్వాడ జయశ్రీ, డైరెక్టర్లు పువ్వాడ నయన్ రాజ్, నరేన్ రాజ్, ప్రిన్సిపాల్ అనురాధ, వెంకటేశ్వరరావు, కృష్ణ వైష్ణవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

**-ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, లక్ష్మణ్**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్ లు తెలిపారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, లక్ష్మణ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని తక్షణమే దానిని ఏర్పాటు చేసేందుకు జిల్లాలోని మంత్రులు చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్సిటీలు ఉన్నాయని ఖమ్మంజిల్లాకు మాత్రమే లేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. ఫీజుల దోపిడీ జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందని గత నాలుగేళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరకొరగా నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలహీనపర్చడం బాధాకరమన్నారు. బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యకు పెద్ద పీట వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సమీకృత గురుకులాలను ఆహ్వానిస్తున్నామని అదే సమయంలో ప్రస్తుతం ప్రభుత్వం నడుపుతున్న మిగిలిన గురుకులాల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించకుండా సమీకృత గురుకులాలకు ఎలా నిర్మిస్తారన్నారు. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాం లో తీవ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది అత్యంత విషాదకర ఘటన అన్నారు. ఉగ్రమూకలను కఠినంగా శిక్షించి దేశ సమగ్రతను, సమైక్యతను పరిరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం, కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మనదేశంలో ఉన్మాదం పెట్రేగిపోతుందని మతం పేరుతో జరిగే ఏ ఉన్మాదానైనా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఇస్లామిక్ ఉగ్రవాదమైనా, హిందు మతోన్మాదమైనా, క్రిస్టియన్ మారణ కాండనైనా వామపక్ష భావజాలం కలిగిన ఏఐఎస్ఎఫ్ వ్యతిరేకిస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ ఏ మతానికి వ్యతిరేకం కాదని మతం పేరుతో జరిగే ఉన్మాదానికి, మూఢత్వానికి వ్యతిరేకమన్నారు. మతోన్మాదుల దాడిలో మరణించిన అమరవీరులకు అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర సమితి తరుపున సంతాపం, సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు ఎండి అన్వర్, మాగం లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శులు నాగులమీరా, మధు, శివ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు మనోజ్, గోపి, ప్రతాప్, రాకేష్, గణేష్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

-కలెక్టర్ మిజిఉమ్మిల్‌ఖాన్
-భూ హక్కులపై అభద్రత తొలగించేలా చర్యలు
-వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ భూభారతి చట్టంతోనే భూ సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ మిజుమ్మిల్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రం కొణిజర్ల శ్రీరామ కళ్యాణమండపం నందు శనివారం నిర్వహించిన తెలంగాణ భూభారతి అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. 1910 నుంచి 1930 వరకు నైజాం కాలంలో భూసర్వే జరిగిందని ప్రస్తుతం జిపిఎస్ సాంకేతికతతో కూడిన యంత్రాలతో సర్వే చేపట్టి భూమిని కొలతలచేసి భూమి తేలితేనే భూసమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. మండలంలో సర్వేయర్ సర్వే సరిగా జరిగినట్లు ధృవీకరణ జరుపుతారని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సుమారు లక్షకు పైగా సాదాబైనామా ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వీరికి పట్టాలు అందించేందుకు భూభారతి చట్టంలో సౌలభ్యం కల్పించామని తెలిపారు. వారసత్వ భూములకు కుటుంబసభ్యులందరికి నోటీసులు పంపినతర్వాతే భూ హక్కుల బదలాయింపు జరగాలని పేర్కొన్నారు. నూతన భూభారతి చట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతు రైతులకు భూసమస్యలకు పరిష్కారం చూపి భూ హక్కులు కల్పించేవిధంగా భూభారతి చట్టం రూపొందించామని తెలిపారు. గతంలో ఉన్న విఆర్వోవ్యవస్థ, అనుభవదారు కాలం మళ్లీ వస్తుందని తెలిపారు. రైతులు ఆర్థికంగా బలపడాలనే రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు మద్దతుతోపాటు రూ 500 బోనస్ అందజేస్తుందని వివరించారు. రెండు లక్షల వరకు రుణాలున్న రైతుల రుణమాఫి చేసినట్లు ప్రకటించారు. నియోజవర్గంలో పట్టాలిచ్చిన వారికి



వ్యవసాయం కోసం 5 వేలకు పైగా బోర్లు వేయించినట్లు తెలిపారు. పోడు భూముల ధరఖాస్తులు ఇంకా మిగిలి ఉంటే పరిశీలించి పరిష్కారం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ రైతుపక్షపాతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జి నరసింహారావు, కొణిజర్ల మండల తహశీల్దార్ రాము, ఎంపిడీఓ రోజారాణి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కరుణశ్రీ, మండల వ్యవసాయాధికారి బాలాజీ, ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మాజీ జెడ్పీటిసి యర్రా బాబు మాట్లాడుతు గతంలో సాదాబైనామాలో ధరఖాస్తు చేసుకోనివారికి అవకాశం కల్పించాలని, అసైన్‌మెంట్, బంచరాయి భూములకు పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమగ్ర భూసర్వేచేసి హద్దులు గుర్తించి పట్టాలు ఇవ్వాలని అన్నారు. యాసంగి వరిధాన్యాం అమ్మిన రైతులకు కింటాకు 12 కేజీలు తరుగుపేరుతో మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట రైతులు స్వర్ణ రమేష్, జి భాస్కర్‌రావు, ఎల్ గోపాల్‌రావు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ మాట్లాడుతు భూసమగ్ర సర్వేద్వారానే భూమికి శ్వాశ్వత హక్కు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. వందేళ్ల క్రితం జరిపిన సర్వే ఆధారంగానే భూమికి హక్కులున్నాయని తిరిగి సర్వే ద్వారానే రైతుల రికార్డులకు భద్రత ఉంటుందని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాదాబైనామా ధరఖాస్తులకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. పార్టీషన్‌లకు స్టాంప్‌డ్యూటి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సర్వేనెంబర్లు సరైన పద్దతిలో లేకపోవడంవలనే రైతులు కోర్టుచుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మేడే ఉత్సవాలను ఘనంగా జరపాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల



**ప్రజాపక్షం/చింతకాని :** మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి ప్రొద్దుటూరు గ్రామ శాఖ సమావేశం షేక్ పుల్లా సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ మేడే ఉత్సవాలలో వాడవాడలా ఎర్రజెండా రెపరెపలాడాలన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యునిస్టు పార్టీ అనేక పోరాటాలు, త్యాగాలు చేసి ప్రజలకు అనేక హక్కులు సాధించిపెట్టిందన్నారు.దేశ సమైక్యత, సమగ్రత కోసం అనేక పోరాటాలు నిర్వహించిన



ఘనత కమ్యునిస్టు పార్టీకి ఉందన్నారు. మోడీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ వర్గాలకు దేశంలోని వనరులు, సంపదను కట్టబెడుతుందన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి ప్రజలను చైతన్య వంతం చేయడం ద్వారా బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించి పాలకుల వ్యతిరేక విధాలనాలను తిప్పికొటాటని పిలుపునిచ్చారు. అనంతరం నూతన శాఖ ను ఎన్నుకున్నారు. నూతన శాఖ కార్యదర్శి గా తుళ్లూరు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా వేల్పుల కోటయ్య,కన్నెపోగు వెంకటితో మరో 15 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు. తొలుత సీనియర్ నాయకులు కళ్యాణపు జానకిరాములు పార్టీ జెండా ఆవిష్కరించారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు, నాయకులు వేపూరి నర్సయ్య, తాళ్లపల్లి అజయ్, తుడుం రాంబాబు, కొల్లి చిన్న వెంకటి పాల్గొన్నారు.

# తలసేమియా రహిత సమాజం కోసం పని చేద్దాం





-ఏఆర్ ఏసిపి నర్సయ్య, ఎస్‌బి సిఐలు రాజిరెడ్డి, హనోక్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తలసేమియా రహిత సమాజం కోసం కలిసి కట్టుగా పనిచేద్దామని ఏఆర్ ఏసిపి నర్సయ్య, ఎస్‌బి సిఐలు రాజిరెడ్డి, హనోక్ లు పిలుపునిచ్చారు. మే ఎనిమిదిన ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రితన్య ఆసుపత్రిలో సంకల్ప తలసేమియా డేకేర్ సెంటర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ ఎనిమిది నుండి మే ఎనిమిది వరకు సంకల్ప సంస్థ పలు కార్యక్రమాల ద్వారా తలసేమియాపై ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. చిన్నారుల పాలిట శాపంగా మారుతున్న తలసేమియా వ్యాధిని అరికట్టేందుకు సమాజాలను ఏకం చేయడం సంస్థ గొప్పతనమన్నారు. సంకల్పకు ప్రతి వర్గం నుండి సహకారం అందించాలని కోరారు. తమ శాఖ ద్వారా చిన్నారులకు అవసరమైన సమయాల్లో రక్తదానం చేస్తామని తెలిపారు. చిన్నారులు క్రమం తప్పకుండా మందులు వేసుకుంటూ వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డి. నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు పి. రవిచంద్ర, పి. పావని, పి. అనిత తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లి గౌతమికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు గౌతమి ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాలలో 470 మార్కులకు 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు కైవసం చేసుకుంది. గౌతమిని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, అతని సోదరుడు హర్షిక ఆగ్రోస్ ఏజెన్సీ ప్రొప్రయిటర్ తోట నాగకృష్ణలు అభినందించి శనివారం సన్మానించారు. మండల మాజీ జడ్పిటిసి పిలువుమేరకు గౌతమికి రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలను ఓర్చి తల్లిదండ్రులు మరణించిన పట్టు విడకుండా చదివి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు. కష్టపడి చదవితే ఏదైనా సాధించవచ్చని గౌతమి నిరూపించిందని అన్నారు. ప్రస్తుత యువత గౌతమిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను ఎదగాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో గౌతమి చదువులో ప్రోత్సహించేందుకు మరింత సహయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గౌతమిని సన్మానించిన వారిలో సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వైరా బస్టాండ్ నందు 250 లీటర్ల మజ్జిగను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అభిమాన సంఘం రాష్ట్ర నాయకుడు గ్రంధి ప్రవీణ్‌కుమార్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా మజ్జిగ పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. యువ నాయకుడు గ్రంధి ప్రవీణ్ 30వ పుట్టినరోజు జరుపుకోవడం సంతోషదాయకమని ఇటువంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని నిరుపేదలకు సహాయం అందించాలని మనిషి సంపాదించిన దానిలో కొంత సమాజానికి సేవ చేయాలని పేర్కొన్నారు. అనంతరం గ్రంధి ప్రవీణ్‌కు స్వీట్లు తినిపించి ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైరా వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు, సెక్రటరీ జివివి.రవికుమార్, కోశాధికారి మైలవరపు శ్రీనివాసరావు, శ్రీలత, పెనుగొండ ఉపేందర్‌రావు, తాటికొండ రాము, మిట్టపల్లి నాగి, బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, ఏదునూరి సీతారాములు, కట్ల సంతోష్, పొదిలి హరినాథ్, మిట్టపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి రజతోత్సవ సభను జయప్రదం చేయాలని భారీ బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/ మధిర :** వరంగల్ లోని ఎల్కతుర్తి క్రాస్ రోడ్డు వద్ద జరిగే బిఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు పిలుపునిచ్చా రు. శనివారం పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం 19, 20వ వార్డుల్లో బిఆర్ఎస్ పార్టీ దిమ్మెలను ఆవిష్కరించటంతో పాటు స్థానిక అమరవీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ ఆదివారం వరంగల్ లోని ఎల్కతుర్తి క్రాస్ రోడ్డు వద్ద జరుగనున్న కేసిఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ బహిరంగ సభకు వేలాదిగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తారు నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, దోకుపర్తి సత్యంబాబు, అప్పారావు, ఆళ్ళ నాగబాబు, కోన నరేందర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో రిలయన్స్ స్మార్ట్ ప్రారంభం





**ప్రజాపక్షం/ మధిర :** మధిరలోని పాత వాసవి థియేటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రిలయన్స్ స్మార్ట్‌ను ప్రముఖ వ్యాపారవేత్త రంగా వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిర పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు అతి తక్కువ ధరలకు కూరగాయలు, కిరాణా సరుకులు, ఫ్రూట్స్, ఇతర వస్తువులను అందించేందుకు రిలయన్స్ స్మార్ట్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేడేను జరుపుదాం



**-వాడవాడలా మేడే జెండా ఎగరాలి**
**-అమానవీయ ఉగ్రదాడి కాండిద్దాం**
**-కేంద్రం ఏనిర్ణయం స్వాగతిస్తుంది**
**-మండలాల కౌన్సిల్ సమావేశంలో**
**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను యాజమాన్యాలకు అనుకూలంగా మారుస్తూ కార్పొరేట్ జపం వల్లిస్తున్న కేంద్రంలో కార్పొరేట్ ప్రభుత్వాన్ని తట్టిలేపే విధంగా మేడే ఉత్సవాలు జరుపుకోవాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి కమ్మవారి కల్యాణమండపంలో జరిగిన కొత్తగూడెం టౌన్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల సిపిఐ కౌన్సిల్ సభ్యుల సమావేశానికి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. పాలకులెవరైనా కార్మికుల హక్కులను కాలరాస్తూ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలనా సాగిస్తున్నారని ఆరోపించారు. కార్మికులు, ఉద్యోగుల హక్కులను వాడా పారిశ్రామిక, కార్పొరేట్ల కోసం నిర్వీర్యం చేస్తున్నారని, దేశ సంపదను సృష్టిస్తున్న కర్మవర్గ చట్టాల అమలు కోసం ఎర్ర జెండాను చేతబట్టుకొని పోరాడాలన్నారు. ఐక్య పోరాటాలే సమస్యలకు పరిస్కారం మార్గమన్నారు. కేంద్రం లోని మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖుని చేస్తూ అల్లర్లకు తెరలేపుతోందని, మందబలంతో అడ్డగోలు చట్టాలను తీసుకువస్తున్నారని విమర్శించారు. పెహల్గామ్ పర్యాటక ప్రాంతంలో జగిరినా ఉగ్రదాడి అమానవీయమని, దీని ప్రతిఒక్కరు ఖండించాలన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్న సిపిఐ స్వాగతిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో, బస్తీలో, కార్మిక క్షేత్రాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశ అనంతరం మేడే వాల్ పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, దుర్గరాసి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, మండలాల కార్యదర్శులు గుండెపిన్ని వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, బొర్రా కేశవరావు, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, జి వీరాస్వామి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, కె రత్నకుమారి, మాతంగి లింగయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# 30న హెడ్ ఆఫీస్ వద్ద నిరసన దీక్ష, మహా ధర్నాను జయప్రదం చేయండి



**-సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కార్మిక సంఘాల జేఏసీ నాయకుల పిలుపు**
**-పని ప్రాంతాల వద్ద విస్తృత ప్రచారం**

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలని కోలిండియా జీతాలు అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు భూక్యా రమేష్, సతీష్ లు పిలుపునించారు. శనివారం సింగరేణి పని ప్రాంతాల వద్ద విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘ జెఏసి నాయకులు సతీష్, భూక్యా రమేష్ మాట్లాడుతూ. అనేక సంవత్సరాల నుండి జీతాల పెంపుదల కోసం దశల వారి పోరాటాలు చేస్తున్నామని జీతాల పెంపుదల విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని సింగరేణి యాజమాన్యంతో చర్చలు జరిపి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు త్వరలోనే పెంచుతామని సింగరేణి సీ అండ్ ఎం డి బలరాం నాయక్ యూనియన్ నాయకులకు హామీ ఇచ్చిన సంగతిని మరిచారని, ఇప్పటికైనా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు జీతాలు పెంచే విధంగా మేడే సందర్భంగా ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. మేడేలోపు జీతాలు పెంచకపోతే తదనంతరం అన్ని యూనియన్ల తో కలుపుకొని జెఏసి ఆద్వర్యంలో పోరాటం ఉధృతంగా కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఈ నెల 30 తేదీన సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉదయం నుండి సాయంత్రం వరకు నిరసన దీక్ష చేపట్టి మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గూగులోత్ సక్రాం, సంజీవ్, శేఖర్, రాజేష్, పద్మ, భాస్కర్, బన్ను బాబురావు, నాగలక్ష్మి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్‌బిఐటి కళాశాల వార్షికోత్సవం





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ప్రో॥ అప్పారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఏడాది కళాశాల సాధించిన ప్లేస్‌మెంట్స్, జాతీయ స్థాయిలో ఎస్‌బిఐటి కనబర్చిన ప్రతిభ పట్ల సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తు తరం కళాశాల నుంచే రూపుదిద్దుకుంటుందని ఆయన తెలిపారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో విద్యార్థి దశ ప్రాముఖ్యమైందని వారి ఎదుగుదలను నిర్ణయిస్తుందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి మాట్లాడుతూ అటానమస్ హోదా కలిగిన తమ కళాశాల విద్యార్థులకు అన్ని విధాలా తోడ్పాటు నందిస్తుందన్నారు. అధునీక ల్యాబ్స్, లైబ్రరీ, అనుభవం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని ఆమె తెలిపారు. విద్యార్థిగా అడుగు పెట్టిన ప్రతి ఒక్కరికి ప్లేస్‌మెంట్లు వచ్చేలా కృషి చేస్తున్నామని , తల్లిదండ్రులు తమ కళాశాలపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రణాళికలు రూపొందించి అమలు పరుస్తున్నామన్నారు. మొదటి సంవత్సరం నుంచే కోడింగ్, అప్టిట్యూడ్ పై శిక్షణ అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ఐటిసి అకాడమీ, హనివెల్, మ్యాంగో డిబి, ఐబిఎం వంటి ప్రపంచ స్థాయి సంస్థలతో తమ కళాశాల అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేవలం డిగ్రీ ల కోసం కాకుండా పూర్తి స్థాయి ఇంజనీర్లను అందించడానికి ఎస్‌బిఐటి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహ నగరాలకు దీటుగా విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు అందించడంలో ఎస్‌బిఐటి ముందు వరుసలో నిలిచిందన్నారు. వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్,జె. రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసరావు, హెచ్‌వోడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మే 6న సీజ్ చేసిన వాహనాలు వేలం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వివిధ గంజాయి కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను మే ఆరున వేలం నిర్వహించనున్నట్లు ఖమ్మం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉప కమిషనర్ జి. జనార్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 18 వాహనాలను ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీ సమీకృత కూరగాయల మార్కెట్ పక్కన గల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఖమ్మం 1 నందు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఎక్సైజ్ స్టేషన్ ఖమ్మం 1 ప్రాంగణంలో ఉన్న వాహనాలను పరిశీలించి వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

# జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించిన నాగరాణి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలోని 21వ వార్డులో నివాసముంటున్న చేబ్రోలు శ్రీనివాసరావు, వెంకటరమణ దంపతుల చిన్నకుమార్తె చేబ్రోలు నాగరాణి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. కూరగాయల వ్యాపారం చేస్తూ పేదరిక కుటుంబానికి చెందిన చేబ్రోలు నాగరాణి పట్టుదలతో కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చునని నిరూపించి జూనియర్ లెక్చరర్‌గా ప్రభుత్వ కొలువు సాధించగా కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటని లెక్చరర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా చేబ్రోలు నాగరాణిని వార్డు పెద్దలు అభినందిస్తూ శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యర్రగుంట లక్ష్మి, రమేష్, డివిజన్ అధ్యక్షులు కోట నాగరాజు, కొండూరి యల్లమందరావు, మోచర్ల సురేష్, రెంటపల్లి ఫ్రాన్సిస్, ఎర్రగడ్డ రమేష్, నల్లమోతుల నర్సింహారావు, దేవిశెట్టి కృష్ణ, వంగూరి గోపి, బల్లి విజయ్‌కుమార్ దోకుపర్తి సత్యంబాబు, మేకల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పహల్గాం మృతులకు విద్యుత్‌శాఖ నివాళి



**ప్రజాపక్షం/మధిర రూరల్ :** కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల నిరంకుశత్వ దాడిలో తూటాలకు బలైన 22మంది భారత పర్యాటలకు విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఎడిఇ అనురాధ ఆధ్వర్యంలో శనివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్రవాదచర్యలను రూపుమాపాలని, భారతీయులంతా ఉగ్రవాదుల దాడులను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధిర రూరల్ ఎస్ఇ మైథిలి, మామునూరు ఎఇ వి.గణేష్, విద్యుత్ శాఖ కార్యాలయ సిబ్బంది, టౌన్, రూరల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 139వ మేడే వేడుకలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ తల్లాడ :** కొట్లాడి సాధించుకున్న కార్మికుల హక్కులను పరిరక్షణ ధ్యేయంగా కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని టియుసిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం తల్లాడలో 139వ మేడే పోస్టర్లను ఆవిష్కరించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు కొట్లాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేబర్ కోడ్‌లను ముందుకు తీసుకువచ్చిందని, కార్మిక వ్యతిరేకవిధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బిజెపి నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని తెలిపారు. దీనిలో భాగంగా మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను దేశ కార్మిక వర్గం నిర్వహిస్తుందని, ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, అన్ని తరగతుల కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్.లామియా, తల్లాడ ఏరియా కమిటీ అధ్యక్షులు పటాన్ నాగుల్‌మీరా, నాయకులు జి.వెంకటేశ్వర్లు, కిషోర్ నాగయ్య, సురేష్, రామకృష్ణ, వెంకటి గోసవీడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ తల్లాడ :** వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే బిఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిఆర్‌ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ బహిరంగసభను నిర్వహిస్తున్నారని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం నుండి భారీగా పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. తల్లాడ మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు 27న ఉదయం బహిరంగ సభకి రావాలని కోరారు. పార్టీ రజతోత్సవ మహాసభ కనివిని ఎరుగని రీతిలో ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం ప్రజలంతా బిఆర్‌ఎస్ వైపే ఉన్నారని తెలిపారు. ప్రతిఒక్క కార్యకర్త సైనికుల్లా తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

# వేంకటేశ్వర స్వామి దేవస్థానంకు రూ.50 వేల మకర తోరణం వితరణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో గల వేంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రముఖ వైద్యులు ఇమ్మడి ప్రసాద్, పుష్పవతి దంపతులు రూ. 50 వేల విలువ గల మకర తోరణాన్ని శనివారం వితరణగా అందజేశారు. పట్టణ ప్రముఖులు ఇమ్మడి రంగారావు తరపున ఆయన కుమారుడు డాక్టర్ ప్రసాద్ ఈ విరాళాన్ని అందజేసినట్లు ఆలయ కమిటీ భాద్యులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు ఇమ్మడి రంగారావు, ప్రసాద్, పుష్పావతి లను ఆలయ కమిటీ నిర్వాహకులు చల్లగుళ్ళ శ్రీనివాస్, దోసపాటి ప్రసాద్

# సెక్టార్ ఆఫీసర్లు బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి

**-సిపి సునీల్ దత్**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సెక్టార్ ఆఫీసర్లకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని తద్వారా శాంతిభద్రతల సమస్య తలెత్త కుండా అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న సెక్టార్ ఇంచార్జ్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిపి సునీల్ దత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సెక్టార్ పోలీసింగ్ ద్వారా నేరాలు అడ్డుకోవడంతో పాటు, ఎప్పుడు ఏ క్షణమైనా మేమున్నామని ప్రజల్లో భరోసా కల్పించాన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనార్ధలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా కట్టుదిట్టమైన నిఘాతో అడ్డు కట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కేసు విచారణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తద్వారా బాధితులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల్లో భాగంగా నిర్వహించే పలు కార్యక్రమాల్లో ఎటువంటి ఆటంకాలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్త కుండా అధికారులు సమన్వయ సహకారం అందించాలన్నారు. ఆన్ లైన్ మోసాలు, లోన్ యాప్ కార్యకలాపాలపై పూర్తిగా నిఘాను పెంచాలన్నారు. చిన్న చిన్న భూమి వివాదాలు సైతం పెద్ద సమస్యగా తలెత్తే అవకాశం ఉంటుందని స్థానిక అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. సిసి కెమెరాల ఏర్పాటు కోసం స్థానికులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. విజబుల్ పోలీసింగ్ , పోలీస్ పెట్రోలింగ్ మరింత పకడ్బందీగా అమలు చేయడం ద్వారా నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. సున్నిత అంశాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే స్టేషన్ హౌజ్ ఆఫీసర్ దృష్టికి తీసుకు రావాలన్నారు. రాత్రి వేళల్లో నిర్మానుష్య ప్రాంతాల్లో గస్తీ పెంచాలని అసాంఘిక కార్యకలాపాలపై క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని సిపి ఆదేశించారు. రాత్రి సమయాల్లో ఏటిఎం సెంటర్లు, బ్యాంకులను సందర్శించాలని, బస్టాండు, రైల్వే స్టేషన్ పరిసరాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసిఆర్‌పి ఏసిపి రవీందర్‌రెడ్డి, సిఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌బిటిఈటీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న డిప్లోమా రెగ్యులర్ సి 21 స్కీమ్ నాలుగు, ఐదు, ఆరు సెమిస్టర్స్, సి 24 స్కీమ్ సెకండ్ సెమిస్టర్, ఈఆర్ 2020 ఫస్ట్ సెకండ్ ఇయర్ ఎండ్ పరీక్షల (ఏప్రిల్ 2025) సందర్భంగా ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్‌ఎస్ఎస్ యాక్ట్ 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమల్లో ఉంటుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28న ఉదయం ఏడు గంటల నుంచి మే మూడు సాయంత్రం ఏడు గంటల వరకు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో ఆయా పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదు గురు మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డిజెలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని సిపి తెలిపారు. పరీక్ష సమయంలో ఆయా పరిసరాలలో ఇంటర్‌నెట్ సెంటర్లు, జిరాక్స్,స్టేషనరీ షాపులు మూసివేయాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సెక్షన్ 163 అమలు చేస్తున్నట్లు సిపి తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సిపి తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందని సిపి తెలిపారు.


# తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన కందాళ



**-వరంగల్ సభకు అధిక సంఖ్యలో తరలి రండి**
**-జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధు**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ఆంధ్ర పాలకుల కబంధ హస్తాల నుండి ఉద్యమ పోరాటాలతో విద్యార్థుల ఆత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకునేందుకు సాగిన ఉద్యమంలో రూపుదిద్దుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు మార్చటాన్ని తెలంగాణ ప్రజలంతా గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కాంగ్రెస్ పాలకులకు తగిన గుణపాఠం చెప్తారని పాలేరు మాజీ శాసన సభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు, రాజారాం గ్రామాలలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు పర్యటించారు. ముందుగా బచ్చోడు గ్రామంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన విగ్రహం కాకుండా, బిఆర్ఎస్ హయంలో తెలంగాణ ప్రభుత్వంలో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ నియంత పోడకలను ప్రజలు గమనించాలని సూచించారు.రెండో ఏడాది కావస్తున్న, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందక ఆదరణ కోల్పోయిన ప్రభుత్వమని విమర్శించారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చడాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ స్ఫూహను మరిపించడానికి పరాయి పాలకులు అన్నిరకాలుగా ప్రయత్నించారు. దానికి విరుగుడుగా తెలంగాణ తల్లి ఆవిర్భవించిందని, మేధావులు, కవులు, కళాకారులు యోచించి, చర్చించి తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక, సామాజిక నేపథ్యంలోంచి ఉద్యమ అవసరంగా 2007లో తెలంగాణ తల్లి రూపాన్ని తీర్చిదిద్దుకున్నాం. ఆ రూపాన్ని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం అనవసరమని ఆయన మండి పడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో రూపొందించిన విగ్రహాన్ని ఈ ఈ బచ్చోడు గ్రామంలో ఏర్పాటుచేసిన, కుమ్మరి కుంట్ల రామకృష్ణ, తోట శ్రీను, జక్కుల యాదగిరి, అనపర్తి కొండలు, అంగిరేకుల రమణ ఈ విగ్రహ కమిటీ సభ్యులకు ప్రతేక అభినందలు తెలిపారు. అనంతరం రాజారాం గ్రామంలో కొత్తగా నిర్మించిన బిఆర్ఎస్ దిమ్మెను ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ..27 న జరిగే వరంగల్ రజితోత్సవ సభకు అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని, సభ ముగిసిన అనంతరం జాగ్రత్తగా అందరూ ఇంటికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భాష బోయిన వీరన్న, ఉపాధ్యక్షులు బానోత్ రవి (ఆర్మీ రవి), మండల నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి, మాజీ పంచ నాయక్,భారావత్ శంకర్, కృషి దర్ రెడ్డి, బచ్చోడు గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కుల యాదగిరి, సీనియర్ నాయకులు అంగరేకుల రమణ రావు, అనపర్తి కొండలు, నందిపాటి లక్ష్మీనారాయణ, అంగిరేకు ఉపెదర్, ఈడబోయిన ఉపేందర్, కుమ్మరి కుంట్ల అప్పయ్య, సందు రాజు, యువ కార్యకర్తలు, సాయి విజయ్, యశ్వంత్, మహేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బూర్గంపాడు, అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ, తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు వరంగల్ ఎలకతుర్తి క్రాస్ రోడ్‌లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు అశ్వారావుపేట నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి రజతోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు.

# ఏఎంసి ఛైర్మన్‌కు పితృవియోగం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు తండ్రి యరగర్ల పిచ్చయ్య (93) శనివారం మృతిచెందారు. పిచ్చయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు యరగర్ల హన్మంతరావు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పని చేస్తున్నారు. పిచ్చయ్య మృతి పట్ల పలువురు నాయకులు, స్థానికులు సంతాపం తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికపై సర్వే



**ప్రజాపక్షం/కామేపల్లి :** మండల పరిధిలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ మండలంలో చురుకుగా కొసాగుతుంది. మండల వ్యాప్తంగా ఆదర్శ గ్రామం పొన్నెకల్ గ్రామంలో 59 మంది లబ్దిదారులను గుర్తించి పనులు కొనసాగిస్తుండగా, మిగతా 23 గ్రామ పంచాయితీలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య కోటాలో 557 మంది లబ్దిదారులను ఎంపిక చేసి క్షేత్రస్థాయిలో పంచాయితీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. మండల పరిధిలోని తాళ్ల గూడెం గ్రామంలో ఎంపీవో, తాళ్లగూడెం ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రెడ్డి శనివారం సమగ్ర సర్వే నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులను గుర్తించి ఉన్నత అధికారులకు సమాచారం పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తాళ్ళగూడెం పంచాయితీ కార్యదర్శి విజయ్, మాజీ వార్డు సభ్యులు నల్లమోతు వెంకట నరసయ్య, పారిశుద్ధ్య కార్మికుడు పెరుగు వెంకటేష్, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమాఖ్య కొత్త సారథులు ఎన్నిక



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని భైరవునిపల్లి గ్రామ సమాఖ్య సంఘం చైతన్య గ్రామ సమాఖ్య అధ్యక్షురాలుగా మల్లెబోయిన పుష్ప, ఉపాధ్యాక్షురాలిగా కుక్కల మణెమ్మ, కార్యదర్శి గా ఆలేటి శ్రీ లక్ష్మి, సహాయ కార్యదర్శి గా పూజ ల భాగ్యమ్మ, కోశాధికారిగా పొట్టపింజర రజనీ లు అదే విధంగా ఓం సాయి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు గా బోమ్మ కవితా, ఉపాధ్యాక్షరాలు గా గండు మౌనీక, కార్యదర్శి గా బాలేబోయిన దివ్య శ్రీ, కోశాధికారిగా బాలిన సూజత లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఐకేపీ సీసీ లు వెంకట్రావమ్మ, పెద్దపాక వెంకటేశ్వరరావు, వీఓఏలు మరికంటి శైలజ, గోపి నాగలక్ష్మి, గ్రూప్ లీడర్లు బుర్ర విజయమ్మ, పొలంపల్లి సునిత, ఆలేటి అలివేలు, కుంచం రాంబయి, బాలిన లలిత, బాలిన నాగలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

# ఒక్క రోజే 403 దరఖాస్తులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ప్రభు త్వం ప్రవేశపెట్టిన భూ భారతి రెవిన్యూ సదస్సులకు దరఖాస్తులు పొటేతుత్తున్నాయి. శనివారం మండలం లోని పైనంపల్లి, మోటాపురం, శంకరగిరితండా గ్రామాలలో జరిగిన సదస్సుకు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు. వివిధ సమస్యల పై రైతులు దరఖాస్తులు అందించారు. పైనంపల్లి లో 200, మోటాపురం103, శంకరగిరితండా 100 దరఖాస్తులను అందించారు. వీటిలో ఎక్కువగా సాదా బైనామా దరఖాస్తులు అధికంగా ఉన్నాయి. ఈ సదస్సు లను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం. రాజేశ్వరి పరిశీలించారు. రైతుల వద్దకు వెళ్లి దరఖాస్తుల ఏ అంశాల పై ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లు వి.వెంకటేశ్వర్లు. తర్జల్ హుస్సేన్, డిప్యూటీ తహశీల్దార్ ఇమ్రాన్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ లు ఆలస్యం మధుసూధన్రావు, అల్లం రవి, మోటాపురం సొసైటీ ఛైర్మన్ భాగం హేమంతరావు, పైనంపల్లి సోసైటి ఛైర్మన్ నాగుబండి శ్రీనివాస్ రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వందలాది మంది సిపిఐలో చేరిన సందర్భంగా ఖమ్మంలో ప్రదర్శన, బహిరంగ సభ దృశ్యాలు
## సిపిఐలో చేరిన వరదా నర్సింహారావు ఆయన అనుచరులు

















